చిన్నకథ

# పావడా

## శ్రీమతి వారణాసి యశోదాదేవి

పావడము అంటే తెల్గు సాహిత్యంలో కానుక యని అర్థము, జక్కన కవిరచిత విక్రమార్క చరిత్రలో "అనుచును నాల్గు మణులును నంబురాశి పావడంబుగ బనిచె నాచేత నీకు" యని గలదు. కవిసార్వభౌముడు శ్రీనాథుడు అనితల్లి, వీరభద్రారెడ్డి కాలంలో రెడ్డి సామ్రాజ్య మహోన్నత దశను వర్ణిస్తూ కాశీ ఖండములో "పండువాసురత్రాణి 'పావడం' బిచ్చిన భద్రేభములు వీధి బాలెముండు" అన్నాడు. వీరభద్రారెడ్డి నగరి వాకిట పండువ నవాబు కానుకగా యిచ్చిన మత్తగజములు కావలియుండెడివని యర్థము.

పావడా అనగా ఆంధ్రములోను, తమిళము లోను కూడ పరికిణీ యనే అర్థము వాడుకలో గలదు. దానినే తెల్గులో లంగా అని కూడ అందురు. సాహిత్యములో కూడ పావడ ప్రయోగము గలదు; వుదా: "క్రొమ్మెరుగు దువ్వలువల్ కడవేసి జిల్గు పావడలొగిగట్టి" ఇంతేకాక పావడా అంటే ధౌత వస్త్రము వస్త్రము యని నానార్థములు గలవు.

ఉద్దుండపురంలో వేంకటపతి, ప్రస్తుతం ఉచ్చ దశలో లేకపోయినా, ఉన్నత వంశమునకు జెందినవాడు. తండ్రి బ్రిటిషు పాలనలో జిల్లా జెడ్జిగా నుండేవారు! తల్లి ధైర్యసాహసములు గల యపర విసాలాక్షి యని యిప్పటికీ వాడుక గలదు. వేంకటపతిగారు తండ్రికి వ్యతిరిక్తంగా గాంధీ సత్యాగ్రహ వుద్యమంలో దూకి ప్రభుత్వ పదవులకాశింపకుండిరి. కాని స్వప్రయోజకత్వంవల్ల గౌరవంగాకాలక్షేపం చేస్తూ వుండేవారు.

విశాలాక్షి - నాయనమ్మ పేరు పెట్టుకున్నారు లెండి- వేంకటపతిగారి మొదటిభార్య సంతతిలో కడగొట్టు పిల్ల: వయసు 12 యేండ్లు: చక్కని చుక్క: పావటా చొక్కా వేసుకుంటుంది. మూడేండ్లకే తల్లి కరువైపోవడంవల్ల నౌకర్లు తదితరులు అల్లారుముద్దుగా పెంచారు. వేంకటపతిగారు తల్లిమాట విని, గృహలక్ష్మి కొరకై మరల వివాహితులై, యెంతో ప్రేమతో పిల్లల్ని చూచుకొంటూవుంటే సంసారం ఎంతో అన్యోన్యంగా, యే అరమరికలు లేకుండ వెళ్ళిపోయేది.

కాని పెద్దకొమ్ముకు వివాహంతో వేంకటపతి గారి కుటుంబ ఐక్యత విచ్ఛిన్నమైనది. ఆవియ్యపరాలు తనకూతురు పదిమందిగల కుటుంబంలో కాపురం చేయలేదని మొదట్లోనే వేరింటి కాపురానికి యేర్పాట్లు చేసి మరీ పెండ్లి చేసింది. సమిష్టి కుటుంబాలంటే యెక్కువ యభిమానం గల తండ్రికిది పెద్ద దెబ్బ! కాని యేంచేస్తారు పాపం!? "విస్సన్న చెప్పిందే వేదం" అన్నట్లు త్వరలోనే రెండో కుమారుడు వేరే వెళ్ళి పెండ్లి చేసికొన్నాడు. అసలు ఈకాలపు వరవడి ప్రత్యేక వ్యక్తిగత కుటుంబములేగాని, సమిష్ట కుటుంబాలు కాదుగదా!

విశాలాక్షికి ఉన్నట్లుండి అన్నలు, వదినల దగ్గరకు వెళ్ళవలెనను కుతూహలం కలుగుతూ వుండేది. కాని అన్నలు చాల మారిపోయారు! పూర్వంవలె చెల్లెలిని దగ్గరకు తీయడం మాని వేసారు. వదినెలకు యీడబడుచు అంటే యభిమానం నాస్తి తండ్రికి కూతురు యెందుకు వారిండ్లకు వెళ్ళడం, వారికేమి బాధ్యత, తనది బాధ్యతయని దురభిమానం.

ఒకరోజు ఉదయం వెంకటపతిగారు పని మీద బయటకు వెళ్ళగానే, విశాలక్షి, తన బుల్లి అన్నయ్య బాలగోపాల్‌తో”, ఒరేయి, బాబూ, నా పరికిణీ సంచీలోపెట్టి అన్నాయి యింటికి సైకిలుమీద నీవు ఆఫీసుకి వెళ్ళునప్పుడు తీసికెళ్ళి పెట్టరా! నేను బడినుంచి సాయంత్రం వదినదగ్గరకి వెళ్ళుతాను. పావడాను స్కూలుకు తీసికెళ్ళితే టీచరు, పిల్లలుకూడ నన్ను యెగతాళి చేస్తారు. ఇలా షికార్లు చేయబట్టే చదువులో వెనుకబడ్డావంటారు” అని చిన్న లెక్చరు కొట్టింది. ఈ పావడా వుదతం యింకెవరికి చెప్పకుండా విశాలాక్షి బడికి వెళ్ళిపోయింది.

బాలగోపాల్ పావడా తీసికెళ్ళి పెద్దన్నయ్య యింట్లో పెట్టాడట. తల్లి తర్వాత తల్లి అంత అనబడే వదినగారు “మాయింటికెందుకు పావడా తేవడం: విశాలాక్షి యిచటికెందు రావడం: మీ అన్నయ్య సంపాదన చాలడంలేదు. పావడా సూర్యారావు యింట్లో పెట్టు” అని మరదిని మందలించినదట. గోపాల్ చిన్న ముఖం చేసికొని సూర్యారావు- అంటే చిన్నన్నగారు యింటికి పావడా పట్టుకు వెళ్ళాడు. ఆ వదిన గారు “మాయింటికి యెందుకు తీసుకువచ్చావు పరికిణీ” అని గద్దించి చెల్లెలు అన్నగారిని యేమియడుగుటకు వస్తుందోయని నిట్టూర్పు విడిచింది. బాలగోపాల్ యేమి జవాబు చెప్పకుంత పావడా సంచీ అచటపెట్టి యింటిదోవ పట్టాడు.

విశాలాక్షి దురదృష్ట వశాత్తు ఆనాడు యేలకో తండ్రి పెద్దకొడుకు యింటికి వెళ్ళడం తటస్థపడింది. మామగార్కి కోడలు పావడా కధంతా చెప్పింది. వెంకటపతిగార్కి పట్టరాని పౌరుషం పొడుచుకొనివచ్చి, యింటికి వస్తూనే రౌద్రంతో వంటింట్లో తొంగిచూచారు. విశాలాక్షి లేదు. తక్కిన పిల్లలకి తల్లి అన్నం పెట్టుతోంది. బాబు వీధి వరండాలో కూర్చున్నాడు. వెంకటపతిగారు బాలగోపాల్‌తో” ఏమిరా బామీ! విశాలాక్షి యెక్కడ వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది. అన్నయింట్లో అడుక్కుతింటానికా” అని కేకలేశారు. పిల్లవాడు భయపడి “యేమో నాకు తెలియదు” అన్నాడు. తండ్రి మరింత కోపంతో “నీకు తెలియదా? అబద్ధాలు చెబుతున్నావా! పరికిణీ సంచీలో పెట్టి తీసికెళ్ళింది నీవేకదా!” అన్నారు. అంతవరకూ వెంకటపతిగారి కోపానికి కారణం తెలియక తల్లడిల్లుతున్న పినతల్లి పిల్లలు విశాలాక్షి పావడా యెంతకథ నడిపింది అనుకొన్నారు.

అక్కడ ఏంజరిగిందనుకున్నారు? విశాలాక్షి రానున్నదని తెలిసి ఫలహారం చేసుకొని తిని మూతి ముడుచుకొని వున్నది. సూర్యారావు భార్య ఆమె ముఖ కవళిక గమనించి విశాలాక్షి “యెందుకు వచ్చానురా! భగవంతుడా” అనుకొని యెలాగో ఆరాత్రి గడపి, మరునాడు ప్రొద్దున్నే బడికి వెళ్ళి. సాయంత్రం యిల్లు చేరింది.

కామమ్మగారు- అంటే విశాలాక్షి దొడ్డమ్మ-” చూచావే! విశాలం! నీపావడా యెంత నాటకం సాగించి, రక్తి కట్టించిందో” అన్నారు.